అపార్..అవస్థల హోరు

- పాఠశాలల్లో నత్తనడకన నమోదు ప్రక్రియ
- ఆధార్ కార్డు, పాఠశాల రికార్డులకు పొంతన లేకుండా విద్యార్థుల వివరాలు
- ఆధార్ నమోదు కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు


ప్రత్తిపాడు సచివాలయంలో ఆధార్ కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ప్రత్తిపాడు: నూతన విద్యా విధానంలో భాగంగా ఒక దేశం, ఒక స్టూడెంట్ పేరుతో తెచ్చిన ఆటోమెటిక్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదులో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. ఆధార్ కార్డు తరహాలో ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులకు 12 అంకెల జీవిత కాలపు ఐడీ కార్డు కోసం విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆధార్‌కు, విద్యార్థికి సంబంధించి పాఠశాలలో ఉన్న వివరాలకు తేడాలు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం మొక్కుబడిగా ఓ నాలుగు పాఠశాలల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేసింది.

అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు..

ప్రతి విద్యార్థికీ జీవిత కాలపు గుర్తింపు సంఖ్యతో కార్డు జారీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను ఇంతకు ముందే విడుదల చేసింది. విద్యార్థుల పూర్తి వివరాలను పొందుపరుస్తూ ‘అపార్’ పేరుతో 12 అంకెల సంఖ్యతో అధికారులు గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు చర్యలు చేపట్టారు. విద్యార్థుల ప్రస్తుత విద్యా సంవత్సర పురోగతిని అంచనా వేసేందుకు ఇది ఉపయోగపడుతుంది. అన్ని పాఠశాల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వీటిని జారీ చేసేందుకు విద్యాశాఖాధికారులు నిర్ణయించారు.

మండలంలో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

ప్రత్తిపాడు మండలంలో 36 ప్రాథమిక పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత, 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 5,948 మంది, 22 ప్రైవేటు పాఠశాలల్లో 4,177 మంది విద్యార్థులు వెరసి 10,125 మంది విద్యార్థులున్నారు. ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థుల సంఖ్య కొంత మేర వేగంగా ఉన్నా...మిగతా ఆరు నుంచి పది తరగతుల విద్యార్థుల సంఖ్య నత్తనడకన జరుగుతోంది.

మండలంలో ఆరు... పనిచేసేది ఒక్కటే...

ప్రత్తిపాడు మండలంలో ఆధార్ కేంద్రాలు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ప్రత్తిపాడు 1 సచివాలయం, తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో, స్టేట్ బ్యాంకు, పోస్టాఫీసు, ధర్మవరం 1, ఒమ్మంగి సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలున్నాయి. వాటిలో ప్రత్తిపాడు 1 సచివాలయంలో మాత్రమే ఆధార్ సవరణ జరుగుతోంది. మిగిలిన కేంద్రాల్లో అంతర్జాలం పనిచేయడం లేదనే నెపంతో ఆధార్ నమోదు చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ప్రత్తిపాడు 1 సచివాలయంలో మాత్రమే ఆధార్ సేవలు అందుబాటులో ఉండటంతో అక్కడ రద్దీ ఎక్కువగా ఉంటోంది.

ఆధార్ కీలకం

కేంద్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థికి అపార్ నంబరును ఇస్తోంది. దీనికి రిజిస్ట్రేషన్ అవ్వడానికి విద్యార్థి ఆధార్ కార్డు కీలకం. ఆధార్ కార్డులోని పేరులో అక్షరదోషాలున్నా, పుట్టినరోజు తేడాగా ఉన్నా, బయోమెట్రిక్ అప్‌డేట్ అవ్వకపోయినా ఆ విద్యార్థికి అపార్ నమోదు (క్రియేట్) కావడం లేదు. పాఠశాల యూ డైస్‌లో విద్యార్థి పేరు ఎలా ఉందో ఆధార్ కార్డులో కూడా అలా ఉంటేనే ‘అపార్’ నంబర్ క్రియేట్ అవుతుంది. దీంతో పాఠశాల విద్యార్థులు ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సుమారు ఐదేళ్ల క్రితం కంటే ముందు ఆధార్ తీసుకున్న వారి వివరాల్లో పెద్ద ఎత్తున తప్పులు ఉన్నాయి. వాటిని సరిదిద్దుకునేందుకు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

వారం రోజులుగా తిరుగుతున్నాను



ఆధార్ కార్డులో తప్పులను సవరించుకునేందుకు ఒమ్మంగి గ్రామంలోని ఆధార్ కేంద్రం చుట్టూ తిరుగుతున్నాను. సిబ్బంది ఎల్లప్పుడూ పని చేయడం లేదంటూ సమాధానం చెబుతున్నారు. ఇప్పటికే మూడు సార్లు వెళ్లాను. నాలుగో సారి పనిచేయడం లేదని, ప్రత్తిపాడు వెళ్లమన్నారు. అందుకే ప్రత్తిపాడు సచివాలయానికి వచ్చాను.

– బొరుసు వెంకటలక్ష్మి, 9వ తరగతి, ఉత్తరకంచి, ప్రత్తిపాడు మండలం

ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి



విద్యార్థుల ఆధార్‌లో వివరాల మార్పునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. మా అబ్బాయి ఆధార్ కార్డులో పేరు సవరణ కోసం పది సార్లు ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చింది. ప్రతి పాఠశాలలో ఆధార్ అప్‌డేట్ కోసం మొబైల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

– రాసంశెట్టి రాజా, విద్యార్థి తండ్రి, పెదశంకర్లపూడి, ప్రత్తిపాడు మండలం

50 శాతానికి పైగా నమోదు



మండలంలో 50 శాతం పైగా విద్యార్థుల అపార్ నమోదు ప్రక్రియ పూర్తయ్యింది. అడ్మిషన్ రిజిస్టర్‌లో లోపాలను తగిన ఆధారాలతో హెచ్‌ఎంలు సరిచేస్తున్నారు. యూ డైస్‌లో లోపాలను ఎంఈఓ కార్యాలయంలో సరిచేస్తున్నాం. ఆధార్ కార్డులో లోపాలను ఆధార్ కేంద్రాల్లోనే చేయించుకోవాలి. – వి రాజబాబు, మండల విద్యాశాఖాధికారి, ప్రతిపాడు.

క్లుప్తంగా

సత్యదీక్షల స్వీకరణ


ఏలేశ్వరంలో సత్యదీక్షలు స్వీకరించిన భక్తులు

ఏలేశ్వరం: పట్టణంలోని పలువురు భక్తులు బుధవారం సత్యదీక్షలు స్వీకరించారు. స్థానిక అనంతలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో భక్తులు 18 రోజులకు గాను మాల ధారణ చేశారు. ఆలయ అర్చకుడు పొన్నూరు సత్యనారాయణచార్యులు తొలుత స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సత్యదీక్షల నియమ నిబంధనలను వివరించారు. ఈ సందర్భంగా సత్యదీక్షల ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు మాట్లాడుతూ అన్నవరంలో ఈ నెల 13న తెప్పోత్సవం, 15న గిరిప్రదక్షిణ నిర్వహించనున్నట్టు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత


తిమ్మరాజుపేటలో అగ్నిప్రమాద బాధితులను పరామర్శిస్తున్న ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి స్థానిక ఎస్సై టి. రామకృష్ణ చేయూతను అందించారు. మండలంలోని తిమ్మరాజుపేటకు చెందిన దివ్యాంగుడు కాపారపు అప్పనబాబు ఇంట్లో ఇటీవల అగ్నిప్రమాదం సంభవించి సామగ్రి సర్వం కాలిబూడిదయ్యాయి. దీంతో దివ్యాంగుడైన అప్పనబాబు, అతని తల్లి రోడ్డున పడ్డారు. బాధిత కుటుంబాన్ని బుధవారం ఎస్సై పరామర్శించి 50 కేజీల బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. దాతలు బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కోటనందూరు: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై టి.రామకృష్ణ సూచించారు. మండలంలోని బొద్దవరం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు బుధవారం మహిళా రక్షక్ (విద్యార్థినుల భద్రత)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులపై భారం లేకుండా విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అనేక వసతులు కల్పిస్తుందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లు, వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో మెలగాలన్నారు. చక్కగా చదివి ఉత్తమ భవిష్యత్‌కు గట్టి పునాదులు వేసుకోవాలన్నారు. పాఠశాలలో ఆడపిల్లలు, సమాజంలో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కేఎస్‌వీఎస్ నారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

గండేపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి మహిళలు, బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించాలని సీఐ వైఆర్కే శ్రీనివాస్ అంగన్‌వాడీ వర్కర్లకు సూచించారు. గండేపల్లిలోని అంగన్‌వాడీ సిబ్బందితో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. మహిళల, బాలికల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

రోగులకు వైద్య సేవలు అందకపోవడంపై ఆరా

జగ్గంపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు స్థానిక సీహెచ్‌సీలో సెక్యూరిటీ గార్డు సిలైన్ ఎక్కించారని వస్తున్న ఆరోపణలపై నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ వివరాలు సేకరించారు. బుధవారం ఆయన సీహెచ్‌సీని పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రణీత్‌తో సమావేశమై ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు వైద్య సేవలు సక్రమంగా అందకపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రాత్రి వేళలో వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు.

సారా స్థావరాలపై దాడులు


రాజవరంలో సారా బట్టీపై దాడి చేస్తున్న ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని శంఖవరం మండలం రాజవరంలో సారా స్థావరాలపై బుధవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పి.వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు శిక్షణ

కోటనందూరు: సమాజంలో ప్రతిఒక్కరూ అక్షరాస్యులై ఉండాలనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉల్లాస్ (సమాజంలో అందరికీ జీవితకాల అభ్యాసంపై అవగాహన)పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 15 సంవత్సరాలు దాటిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఈ పథక ఉద్దేశమన్నారు. ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, వాణిజ్య నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణ, పిల్లల సంరక్షణ, కుటుంబ సంక్షేమం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డ్వాక్రా మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ రామశేఖర్, ఏపీఎం సూర్యకుమారి, సీడీపీఓ శ్రీలత పాల్గొన్నారు.

ఉల్లాస్ వలంటీర్లకు శిక్షణ



రౌతులపూడిలో వలంటీర్లకు శిక్షణ ఇస్తున్న సిబ్బంది

రౌతులపూడి: నిరక్షరాస్యులకు అక్షరాభ్యాసంతో పాటు ప్రజలకు డిజిటల్, ప్రాథమిక, ఆర్థిక విద్యను అందించేందుకు గాను ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. పదిహేను ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా మార్చడమే కార్యక్రమం లక్ష్యమని ఎంపీడీఓ శివరామకృష్ణ అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 గాడి కొండబాబు, వెలుగు ఏపీఎం నాగమణి, ఐసీడీఎస్ మండల విస్తరణాధికారిణి జానకీలక్ష్మి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఐలాజ్ రాష్ట్ర మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో ఐలాజ్ మహాసభల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రత్తిపాడు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శేషాద్రి సదన్‌లో శుక్రవారం ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) తొలి రాష్ట్ర మహాసభ నిర్వహించనున్నట్టు ఐలాజ్ రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ బుగత శివ తెలిపారు. డిసెంబర్ 21, 22 తేదీల్లో ఒడిశా రాష్ట్రం కటక్‌లో రెండో జాతీయ మహాసభలను నిర్వహిస్తామన్నారు. ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో బుధవారం జరిగిన ఐలాజ్ సమావేశంలో ఆయన మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా న్యాయవాదుల సమస్యలపై ఐలాజ్ పోరాటాలు చేస్తోందన్నారు. న్యాయవాదులపై దాడులకు వ్యతిరేకంగా ప్రొటెక్షన్ యాక్ట్‌ను రూపొందించాలని, జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ ఇవ్వాలని, 60 ఏళ్లకు పైబడిన న్యాయవాదులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఐలాజ్ కన్వీనింగ్ కమిటీ సభ్యురాలు అవసరాల దేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, కార్యదర్శి బొంగుకూరు మధుబాబు, సీనియర్ న్యాయవాదులు బండారు నరసింహారావు, ఆదారి సుగుణ, పైలా సుబాష్ చంద్రబోస్, జోగా శివప్రసాద్, రామిశెట్టి సత్యనారాయణ, జి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


జగపతినగరంలో లక్ష బిల్వార్చన చేస్తున్న అయ్యప్ప మాలధారులు

ఘనంగా లక్ష బిల్వార్చన

కిర్లంపూడి: స్థానిక గౌరీశంకరుల ఆలయం ప్రాంగణంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామికి లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. గురుస్వామి వి.శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో హరిహరసుత అయ్యప్ప స్వామి వారికి లక్ష బిల్వార్చన, పడి పూజ చేశారు. స్థానిక, పరసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో స్వాములు పాల్గొన్నారు. పూజను తిలకించేందుకు గ్రామస్తులు భారీగా తరలివచ్చారు. గురుస్వామి శ్రీనివాస్ శర్మ ఆలపించిన అయ్యప్పస్వామి భక్తిగీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తొలిత స్వాములు గ్రామంలో పేటతుళ్లి నిర్వహించారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, యువ నాయకుడు ముద్రగడ గిరిబాబు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

డిజిటల్ దొంగతనాలపై అవగాహన పెంచుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వైఆర్‌కె శ్రీనివాసరావు

జగ్గంపేట: డిజిటల్ దొంగతనాల పట్ల మహిళలు అవగాహన పెంచుకోవాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు సూచించారు. జగ్గంపేట ఐసీడీఎస్ కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో మహిళలకు సమాజంలో జరుగుతున్న వివిధ నేరాలు, వాటి నివారణపై అవగాహన కల్పించారు. కొంత మంది నేరస్తులు, అజ్ఞాత వ్యక్తులు ఇళ్లు అద్దెకు తీసుకుని గ్రామాల్లో మకాం వేస్తున్నారన్నారు. ఇలాంటి వారితో ప్రమాదాలు పొంచి ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్ వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన

తొండంగి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్టు తహసీల్దార్ మురార్జీ బుధవారం తెలిపారు. వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులకు ఎమ్మెల్సీ ఎన్నికల నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం


కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మ నక్షత్రం ‘మూల’ సందర్భంగా బుధవారం అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టెం గోపి, కృష్ణకుమార్, కూచుమంచి ప్రసాద్, దేవులపల్లి ప్రకాష్ తదితరులు హోమం నిర్వహించారు.

ప్రజాహక్కుల ర్యాలీని విజయవంతం చేయాలి


పాండవులపాలెంలో ర్యాలీ చేస్తున్న లిబరేషన్ శ్రేణులు

ప్రత్తిపాడు రూరల్: మత రాజకీయాలకు వ్యతిరేకంగా విజయవాడలో డిసెంబర్ 4న నిర్వహించే ప్రజాహక్కుల ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకుడు మానుకొండ లచ్చబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పాండవులపాలెంలో లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంఘం అధ్యక్షులు ఆర్.సింహాచలం, లిబరేషన్ పార్టీ నాయకులు రెల్లి సత్యనారాయణ, కర్రి నాగేశ్వరరావు, సోమల శ్రీను, సీతారామరాజు, ఒనుగుల సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాపులతో ఉద్యోగావకాశాలు


వర్క్‌షాపులో పాల్గొన్న ఇంజినీరింగ్ విద్యార్థులు

గండేపల్లి: విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వర్క్‌షాపులు దోహదం చేస్తాయని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు పేర్కొన్నారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో బిల్డింగ్ డేటా డ్రివెన్ వెబ్ సైట్స్ విత్ హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్‌పై మూడు రోజుల పాటు వర్క్‌షాపు నిర్వహించినట్టు బుధవారం ఆయన తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన బ్రెయినోవిజన్ ఎక్స్‌పర్ట్ ట్రైనర్ ఎం.నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు వెబ్ అప్లికేషన్లలో ఉండే వివిధ ప్రక్రియలు, ప్రాజెక్టులు చేయటకు అనుసరించాల్సిన ప్రణాళికలను అనుభవపూర్వకంగా నేర్చుకుని సాంకేతిక ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, కె.సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ సతీష్, ప్రిన్సిపాల్ జి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా.. రైతుకు ధీమా

- బీమాపై రైతులకు అవగాహన
- గ్రామాల్లో జోరుగా పొలం పిలుస్తోంది కార్యక్రమాలు



కేపీ అగ్రహారంలో ఉద్యానపంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ చంద్రశేఖర్

ఏలేశ్వరం: పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి సూచించారు. మండలంలోని యర్రవరంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల బీమాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన ద్వారా 50 ఏళ్లలోపు రైతులు రూ.436 చెల్లిస్తే రూ. 2 లక్షలు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో 70 ఏళ్ల లోపు రైతులు రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షలు ప్రమాద బీమాకు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు వ్యవసాయశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు మైరాల కనకారావు, ఉద్యాన, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కోటనందూరు: పంటల బీమాతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కాకరాపల్లి, కేఏ మల్లవరం, కేఓ అగ్రహారం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా ఉద్యాన, అపరాల సాగుకు బీమా చెల్లిస్తే ఎటువంటి ప్రమాదం వాటిల్లినా బీమా వర్తిస్తుందన్నారు. జీడిమామిడి పంటలకు రూ.1500, అపరాలకు రూ.300 చొప్పున బీమా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఉద్యాన, వరి పంటలను పరిశీలించి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు కేవీ శివకుమారి, నల్లమిల్లి సురేష్ పాల్గొన్నారు.

భూమి సంరక్షణకు జీవ ఎరువులు తప్పనిసరి

తుని రూరల్: సాగు భూములను సంరక్షించుకునేందుకు, పంటల్లో తెగుళ్ల నివారణకు జీవ ఎరువులు తప్పనిసరిగా వాడాలని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్ కుమార్ సూచించారు. మండలంలోని మరువాడ, సుభద్రయ్యమ్మపేట గ్రామాల్లో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీవ ఎరువులు వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. జీవ ఎరువులు తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పంట బీమాను సద్వినియోగం చేసుకోవాలి

శంఖవరం: రైతులు పంట బీమా పథకాన్ని వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి గాంధీ సూచించారు. మండలంలోని అచ్చంపేట, గౌరంపేట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ ఆధారిత పంటల బీమాలో భాగంగా జీడిమామిడి తోటలకు బ్యాంక్‌లో రుణం పొందలేని రైతులు ఎకరాకు రూ.1500 చెల్లించి ఈ పథకంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ నెల 15తో గడువు ముగుస్తుందని తెలిపారు. అనంతరం వరి, పత్తి, జీడిమామిడి తోటలను రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు క్రాంతి, సువర్ణ రాజు, రైతులు పాల్గొన్నారు.


యర్రవరంలో పంటల బీమాపై అవగాహన కల్పిస్తున్న మండల వ్యసాయాధికారి జ్యోతి

ప్రత్తిపాడు రూరల్: రైతులు పంట బీమాను గడవు లోపు నమోదు చేయించుకోవాలని ఉద్యాన అధికారి శ్రీవల్లీ సూచించారు. మండలంలోని యూజే పురం, వెంకటనగరం, తోటపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు బీమా, సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నడిగట్ల త్రిమూర్తులు, ఎంపీటీసీ సింహాద్రి, గాది తాతాజీ, ఒట్టికోళ్ల పెద్దకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై వరికుంచెల తోరణం ఏర్పాటు


రత్నగిరిపై సత్యదేవుని ఆర్చికి వరికంకుల తోరణం కట్టిన దాలినాయుడు బృందం

అన్నవరం: పర్యావరణానికి మేలు చేసే పిచ్చుకలు అంతరించిపోకుండా కాపాడేందుకు గాను హరిత వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వరి కుంచెలను ఏర్పాటు చేస్తున్నట్టు ఆ ఫౌండేషన్ సభ్యుడు, విశ్రాంత హిందీ ఉపాధ్యాయుడు దాలి నాయుడు తెలిపారు. బుధవారం ఆయన రత్నగిరిపై సత్యదేవుని ఆర్చికి వరి కంకులతో రూపొందించిన తోరణాన్ని కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించుపోతున్న పక్షి జాతుల్లో పిచ్చుక మొదటి స్థానంలో ఉందన్నారు. సెల్ టవర్ల కారణంగా దాదాపుగా అంతరించిపోయిన పిచ్చుకలు గత మూడు, నాలుగేళ్ల నుంచి మళ్లీ కనిపిస్తున్నాయని తెలిపారు. పంటలను ఆశించిన పురుగులను తిని పంట దిగుబడి పెంచడంతో పిచ్చుకల పాత్ర కీలకమన్నారు. పిచ్చుకల సంరక్షణలో భాగంగా వరి కుచ్చులు కట్టడంపై రైతులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నవదంపతులకు వరికంకుల బహూకరణ రత్నగిరిపై జరుగుతున్న ఓ వివాహానికి హాజరైన దాలినాయుడు వివాహ కానుకగా నవదంపతులకు, పెళ్లికి హాజరైన వారికి వరి కుంచెలు బహూకరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 12 మందికి జరిమానా

జగ్గంపేట: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 12 మందికి న్యాయస్థానం జరిమానా, జైలు శిక్ష విధించిందని స్థానిక సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీసు సర్కిల్ పరిధిలోని జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో చేపట్టిన డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడిన 12 మందిని బుధవారం పెద్దాపురం కోర్టులో హాజరు పరిచామన్నారు. వీరిలో ఇద్దరికి రూ.10 వేల చొప్పున, ఐదుగురికి రెండు రోజులు చొప్పున జైలు శిక్ష, మరో ఐదుగురికి మూడు రోజులు జైలుశిక్ష న్యాయంస్థానం విధించిందని ఆయన వివరించారు.